నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 19: టీఎస్ ఎస్ పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి గోల్కొండ ఎక్స్ రోడ్, స్పెన్సర్, దాయర మార్కెట్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడిఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోల్కొండ ఎక్స్ రోడ్, స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని కృష్ణకాలనీ, శివాలయం టెంపుల్, ఏక్ మినార్ మసీదు, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్, రాజా డీలక్స్, రేస్ కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్, చర్చి గల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దాయర మార్కెట్ ఫిడర్ల పరిధిలోని దాయర మార్కెట్, రిసాల, సాగర్ లాల్ హాస్పిటల్, హరినగర్, తాడి కంపౌండ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

బోనాల నిధుల కోసం దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తులను స్వీకరిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, జూన్ 19: తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయాల నిర్వాహకుల నుంచి వేడుకల నిర్వహణ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు కోసం గురువారం మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరు సునీత నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాల మేరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్ పేట్, జూన్ 19: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచనతో కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి గొప్ప పథకాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, నాయకులు నాగులు, అశోక్‌యాదవ్, శ్రీహరి, నామన సంతోష్, లక్ష్మిపతి, శేఖర్, మహేష్‌యాదవ్, ఆరీఫ్, నర్సింహ, బలరాం, సత్యనారాయణ, కుమార్‌యాదవ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామూహిక బాధ్యత

మేడిబావిలో అధికారులతో కలిసి శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జూన్ 19: పరిసరాల పరిశుభ్రత సామూహిక బాధ్యత అని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ సురేష్ థియేటర్ వద్ద శానిటేషన్ డ్రైవ్‌ను అధికారులతో కలిసి కార్పొరేటర్ గురువారం ప్రారంభించారు. సురేష్ థియేటర్, బీదబస్తీ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త తొలగింపు, డ్రైనేజీ లైన్ల శుభ్రపరచడం, చెట్టు కొమ్మలు, మురుగు నీటి నిల్వలు తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది మాత్రమే కాకుండా, ప్రతిఒక్కరు స్వచ్ఛత పట్ల చొరవ చూపాలని అన్నారు. జీహెచ్ఎంసీ అధికారుల సహకారం ఎంతగానో ఉన్నా, ప్రజల భాగస్వామ్యం లేకపోతే శుభ్రత సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రతిఇంటి ముందు శుభ్రంగా ఉంచుకుంటేనే కాలనీల రూపం మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుభాష్, డీఈఈ వెంకటేష్, ఏఈ కౌశిక్, శానిటేషన్ జవాన్లు, ఎస్ఎఫ్ఐలు నాయకులు రాజు, శైలెందర్, కృష్ణ, అజీజ్, మహేష్, లక్ష్మి, సుజాత, లలిత, పద్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్య సేవలకు సహకారం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

లబ్ధిదారులకు ఎల్వోసీ మంజూరు పత్రాలు అందజేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 19: పేదల వైద్య సేవలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన శ్రీనివాస్‌నగర్ నివాసి మైత్రి చేతన్ కార్తీక్ అనారోగ్యంతో సతమతమవుతున్న దశలో సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అతడి వైద్య చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) పత్రాన్ని సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం భారంగా మారిన దశలో సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని, సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలకు సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పద్మారావుగౌడ్ సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

చిక్కడపల్లి, జూన్ 19: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెప్పారు. గురువారం సాయంత్రం గాంధీనగర్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు ముఠా జయసింహ తో కలిసి నియోజకవర్గంలోని ముషీరాబాద్, అడిక్మెట్ డివిజన్‌లలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రూ.4,50,000 విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జయసింహ, డివిజన్ ప్రెసిడెంట్లు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, నాయకులు భిక్షపతియాదవ్, ఆర్.శ్రీనివాస్, బల్ల ప్రశాంత్, జార్జ్, రాజు, కె.ఎం.సాయి, లడ్డు, శ్రీకాంత్‌యాదవ్, దుర్గేష్, కాజా, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ

రేషన్ షాపును తనిఖీ చేసిన కార్పొరేటర్

బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ: బౌద్ధనగర్ డివిజన్‌లోని రేషన్ షాప్‌ను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వచ్చిన బియ్యం లోడ్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సరైన సమయపాలన సూచించాలని కోరారు.

ఓయూతో అమెరికా వర్సిటీ ఎంవోయూ

ఎంవోయూ చూపుతున్న ఇరు యూనివర్సిటీల అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్'తో ఉస్మానియా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో విద్యార్థుల సమగ్ర వికాసం, శిక్షణా రూపకల్పన, బోధనలో ఓయూ ఎడ్యుకేషన్ విభాగం, యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్‌చైల్డ్ సంస్థ ఇకపై కలిసి పనిచేయనున్నాయి. సర్వస్థాయి (whole school) దృక్పథం ద్వారా సామాజిక, భావోద్వేగ విద్య (Social and Emotional Learning-SEL) ను అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి సహా ఉమ్మడి పరిశోధనలకు తోడ్పడనుంది. ఈ మేరకు ఒప్పందంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ నోటెర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నీల్ బూత్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్, కే మూర్తి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎంవోయూ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.కిషన్, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ: బౌద్ధనగర్ డివిజన్ రామాలయం సమీపంలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఆమె ఈ సందర్భంగా కోరారు.

యోగా సాధన చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలి



యోగా శిక్షకులను సన్మానించి మెమెంటోలు అందజేసిన రాయల సేవాసమితి

అమీర్‌పేట్, జూన్ 19: భారతీయ ప్రాచీన యోగా విధానాలను ఇంటింటికి చేర్చడంలో తమ వంతు భాగస్వామ్యంగా యోగా శిక్షకుల కృషి మరువలేనిదని రాయల సేవా సమితి ఎస్ఆర్‌నగర్ అధ్యక్షుడు ఆర్‌సీ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం బీకేగూడలోని జయ భారతి స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటికి యోగాను విస్తరించడంలో నిస్వార్థంగా తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తున్న పలువురు యోగా శిక్షకులను రాయల సేవాసమితి అధ్యక్షుడు ఆర్‌సీ కుమార్ ఘనంగా సత్కరించి మెమెంటోలు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన యోగా విధానాల సాధనను విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమం తప్పకుండా చేపట్టడం వారిని కేవలం తరగతి గదుల్లోనే కాకుండా ఇతర వ్యాపకాల్లో కూడా చురుగ్గా ఉంచేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు యోగాసనాలు కొన్ని వారిచేత సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు విజయశ్రీ, అమరేశ్వరి, నాగరేఖ, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ ఇంటర్వ్యూ ఫీజు రద్దు చేయాలి

ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశ ప్రక్రియలో భాగంగా ఇంటర్వ్యూ ఫీజును తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల నుంచి ఒకే రీతిన ఫీజు వసూలు చేయడం రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. గత నోటిఫికేషన్‌లో కేవలం దరఖాస్తు సమయంలో మాత్రమే ఫీజు తీసుకున్నారని గుర్తు చేశారు. కానీ ఈ ఏడాది ప్రవేశ పరీక్ష దరఖాస్తు సమయంలో రూ.1500 తీసుకున్నారని చెప్పారు. మళ్లీ ఇంటర్వ్యూ సమయంలో రూ.1500 ఫీజు చెల్లించాలనడం సరికాదన్నారు. ఈ ఫీజును తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారని చెప్పా రు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అర్జున్, శివ, రాము, చందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమాన్ నిర్మాణానికి ఏర్పాట్లు

బన్సీలాల్‌పేట్, జూన్ 19: పద్మారావు నగర్‌లోని హమాలీబస్తీలో నల్ల పోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయం గేటు పైన కమాన్ నిర్మాణం చేయించాలని బస్తీ వాసులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీవాస్‌యాదవ్‌ను కోరారు. ఆయన వెంటనే తన సొంత ఖర్చుతో కమాన్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి జి.పవన్‌కుమార్ గురువారం హమాలీ బస్తీ వద్ద స్థానికులతో చర్చించి కమాన్ నమునా పరిశీలించారు. మార్పులు ఏమైనా చేయాలా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు కుషాల్, యాదగిరి, సుభాష్, కౌసల్య, రవి, గురు, వెంకటేష్, హరి, సత్యనారాయణ, పార్టీ నాయకులు మహేందర్‌గౌడ్, ముక్క శీను తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన జీతాలను మంజూరు చేయాలి

చిక్కడపల్లి, జూన్ 19: బాసర ఐఐఐటీలో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన జీతాలను వెంటనే మంజూరు చేయాలని బీఎంఎస్ ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యుడు కేవీ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బాసర ఐఐటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ అధికారి డీసీఎల్ నీలమ్మకు వినతిపత్రం ఇచ్చారు. 8 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలన్నారు. ఈఎస్ఐ పీఎఫ్ సమస్యలను పరిష్కరించి, నెలసరి వేతన పత్రాన్ని (పే స్లిప్) ఇవ్వాలన్నారు. అనంతరం ఉప కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, శంకర్, రంగారావు, అజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయాన్ని కబళిస్తున్న కార్పొరేట్లు'

చిక్కడపల్లి, జూన్ 19: దేశంలో వ్యవసాయరంగాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు కబలిస్తున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగు మందులు ఆ కంపెనీల గుత్తాధిపత్యంలో (46శాతం) బంధీ అవుతున్నాయని విమర్శించారు. గురువారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం సంయుక్తంగా 'వ్యవసాయం రంగం-ఎదుర్కొంటున్న సవాళ్లు' పై అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో విజూ కృష్ణన్ మాట్లాడారు. సరళీకరణ విధానాలతో రైతులకు అనేక సౌకర్యాలు అందుతాయని నాటి పాలకులు నమ్మబలికారని తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. 30 ఏండ్లుగా సరళీకరణ విధానాల వల్ల దేశంలో నాలుగున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరిబండి ప్రసాద్‌రావు రచించిన 'నేను-మనభూమి ఒక జీవన స్మృతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యానవన వర్సిటీ వీసీ రాజిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, పంజాబ్ ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి అరిబండి వేణుప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి అరిబండి మనోహర్, కోశాధికారి అరిబండి అనిల్, సభ్యులు అమర్‌నాథ్, ప్రసాదరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

ఏక పద్మ స్మారక పురస్కారం

ముషీరాబాద్, జూన్ 19: శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఏక పద్మ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ ముదావత్ కిషన్‌కు ఏక పద్మ స్మారక పురస్కారాన్ని అందించారు. డాక్టర్ దంతురి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రుద్రవీణ బాలసుబ్రమణ్యం, పొత్తూరి జయలక్ష్మి, ఏకా నాగరాజ రామ్మోహన్‌రావు, ఏకా వెంకట ధర్మ సంవర్ధిని, లంక వెంకట సుబ్రమణ్యం, భాను తదితరులు పాల్గొన్నారు.

దూద్‌బావి పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న చిన్నారెడ్డి, తదితరులు

అడ్డగుట్ట, జూన్ 19: చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం యూకేజీ, 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, ప్రజావాణి రెవెన్యూ నోడల్ అధికారి సూర్యప్రకాష్, సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ ఈవో శ్రీధర్, మారేడ్‌పల్లి డిప్యూటీ ఐఓఎస్ మదన్‌మోహన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఎలికేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు అన్ని విధాలుగా బాగుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బన్సీలాల్‌పేట్: ముస్లిం శ్మశానవాటికలో తమ అభ్యర్థన మేరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయడానికి నిధులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ డివిజన్ అధ్యక్షుడు షేక్ జావేద్ అన్నారు. గురువారం రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కె.లక్ష్మిపతి, షేక్ జహంగీర్, రుక్ముద్దీన్, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.